యూరియా కష్టాలు

- పీఏసీఎస్‌ల నుంచి యూరియా పక్కదారి
- యూరియా కోసం పీఏసీఎస్‌ల వద్ద బారులు తీరిన రైతులు
- ఒక్క యూరియా కట్ట కూడా దొరక్క నిరాశతో వెనుదిరిగిన రైతులు
- కూటమి ప్రభుత్వం తీరుపై రైతుల ఆగ్రహం



కోడూరు మండలం లింగారెడ్డిపాలెం పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతుల పడిగాపులు

కోడూరు: ఓ వైపు యూరియా బయట మార్కెట్‌లో దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. మరోపక్క ప్రభుత్వం నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు (పీఏసీఎస్) వచ్చే యూరియా కట్టలను పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

మండలంలో ఆరు పీఏసీఎస్‌లు..

కోడూరు మండలంలో ఏడు వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. అయితే వీటిల్లో ఆరు పీఏసీఎస్‌లకు మంగళవారం రాత్రి 80 టన్నుల యూరియా వచ్చింది. బుధవారం ఈ యూరియా కట్టలను రైతులకు సంఘ కార్యాలయాల వద్ద పంపిణీ చేయాలి. అయితే పీఏసీఎస్‌ల సిబ్బంది, వ్యవసాయ అధికారులు కొన్ని పీఏసీఎస్‌లో యూరియా కట్టలను మంగళవారం అర్ధరాత్రి బయటకు తరలించినట్లు సమాచారం. వ్యవసాయ అధికారుల సహకారంలో సిబ్బంది ఆరు పీఏసీఎస్‌లో సుమారు 15 టన్నుల యూరియాను పక్కదారి పట్టించినట్లు రైతులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు.

కార్యాలయాల వద్ద ..

యూరియా పంపిణీ చేస్తారనే సమాచారంలో రైతులు బుధవారం వేకువజామున 6గంటలకే పీఏసీఎస్ కార్యాలయాల వద్దకు పెద్దసంఖ్యలో చేరారు. అయితే కార్యాలయాలను అధికారులు ఉదయం 9గంటల వరకు తెరవకపోవడంతో అన్నదాతలకు పడిగాపులు తప్పలేదు. లింగారెడ్డిపాలెం, ఉల్లిపాలెం, వి.కొత్తపాలెం, సాలెంపాలెం, విశ్వనాథపల్లి, బడేవారిపాలెం పీఏసీఎస్‌ల రైతులు యూరియా కోసం తరలివచ్చి క్యూలైన్లలో వేచి ఉన్నారు. అయితే ఒక్క రైతుకు కేవలం ఒక్క యూరియా కట్టను మాత్రమే అధికారులు ఇవ్వడంతో పాటు ఆ కట్టను ఇచ్చేందుకు కూడా ఆధార్, పాస్‌పుస్తకం జిరాక్స్ కావాలంటూ మెలిక పెట్టారు.



కోడూరు మండలం వి.కొత్తపాలెం పీఏసీఎస్ కార్యాలయ రహదారిలో యూరియా కోసం వచ్చిన రైతుల వాహనాలు

అందరికీ అందకపోవడంతో..

అన్ని పీఏసీఎస్‌ల్లో యూరియా స్టాకు అయిపోవడంతో చాలా మంది రైతులు నిరాశతో వెనుదిరిగా వెళ్లారు. గతంలో యూరియా కోసం ఎప్పుడూ చూడలేదని, కూటమి ప్రభుత్వం ఎరువుల పంపిణీలో కూడా విఫలమైయిందంటూ రైతులు మండిపడ్డారు. యూరియా కోసం అన్ని పనులు మానుకొని పీఏసీఎస్‌ల వద్ద పడిగాపులు పడినా కూడా యూరియా దొరకని పరిస్థితి నెలకొందని, ఇలా అయితే వ్యవసాయం ఏలా చేయాలంటూ ప్రశ్నించారు. క్యూలైన్‌లో రైతుల మధ్య ఘర్షణలు కూడా జరగడంతో పోలీసులు పీఏసీఎస్‌ల వద్ద బందోబస్తు నిర్వహించడం గమనార్హం.

యూరియా కోసం రైతన్నల పాట్లు

మోపిదేవి: యూరియా కోసం గతంలో ఎప్పుడూ లేని విధంగా నానా పాట్లు పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో 10 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉండగా 8 సొసైటీలకే బుధవారం 110 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. మేళ్లమర్తిలంక, కొక్కిలిగడ్డ సొసైటీలకు యూరియా ఒక్క కట్టకూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మోపిదేవి, కె. కొత్తపాలెం సొసైటీలకు మాత్రం 20 టన్నులురాగా, మిగిలిన 6 సొసైటీలకు 10 టన్నుల వంతున యూరియా వచ్చిందని మండల వ్యవసాయాధికారిణి హెప్సిబారాణి తెలిపారు. ప్రైవేటు మార్కెట్‌లో యూరియా కట్ట రూ.400 పైగా విక్రయించడంతో పాటు గుళికలు కూడా తీసుకెళ్లాలని షరతులు విధించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూరియాకోసం తెల్లవారు జాము నుంచే సొసైటీల వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అడపావారిపాలెం సొసైటీకి యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు ఉదయమే అక్కడకు చేరుకున్నారు. కానీ మధ్యాహ్నం వరకు సొసైటీ తాళాలు తీయలేదు. తమ అనుయాయులకు అందించేందుకు సొసైటీ తలుపులు కూడా తీయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు వెనుదిరిగి వెళ్లారు.



కె.కొత్తపాలెం సొసైటీ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

దీంతో నియోజకవర్గ ప్రత్యేక అధికారి సాయిబాబు, అవనిగడ్డ ఏడీఏ జయప్రద, తహసీల్దార్ ఎం.హరనాథ్, ఎస్‌ఐ సత్యనారాయణ బృందాలుగా మండలంలో పర్యటిస్తూ యూరియాను పంపిణీ చేయాల్సి పరిస్థితి ఏర్పడిందని రైతులు విమర్శిస్తున్నారు. అయినా అడపావారిపాలెం సొసైటీలో యూరియా పంపిణీ చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతలకు తప్పని తిప్పలు

పెడన: మండలంలో అన్నదాతలు యూరియా కోసం పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. బయట మార్కెట్‌లో గుళికలతో పాటు అధికధరలకు కొనుగోలు చేయలేక ప్రభుత్వం అందించే సబ్సిడీ యూరియాను తీసుకునేందుకు అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. బుధవారం మండల పరిధిలోని ఉరివి, చెన్నూరు గ్రామాలకు యూరియా రావడంతో రైతులు క్యూ కట్టారు. చెన్నూరుకు పది టన్నులు, ఉరివి గ్రామానికి 20 టన్నులు రావడంతో రైతులకు వీటిని పోలీస్ బందోబస్తు నడుమ అందజేశారు. ఉరివిలో ఆరుగుబయట కూర్చుని రైతుల పేర్లు నమోదు చేసుకుని అందించడం గమనార్హం. చెన్నూరులో పీఏసీఎస్‌లో అందజేశారు. మళ్లీ వస్తాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏవో జెన్నీ తెలిపారు.



ఉరివి గ్రామంలో యూరియా కోసం పేర్లను నమోదు చేయించుకుంటున్న అన్నదాతలు

విద్యార్థి దశ నుంచే సేవాభావం అభినందనీయం

- కేయూ వీసీ రాంజీ
- పది మంది ఉపాధ్యాయులకు సత్కారం

మచిలీపట్నంటౌన్: నగరంలోని సన్ స్టార్ స్కూల్ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని దాతృత్వాన్ని అలవర్చుకోవడం అభినందనీయమని కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ కూన రాంజీ అన్నారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న సన్ స్టార్ స్కూల్లో బుధవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో టీచర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా 10 మంది ఉపాధ్యాయులను వీసీ రాంజీ ఘనంగా సత్కరించారు. విద్యార్థులు సేకరించిన రూ.2 లక్షల నగదును నగరంలోని ఏడు స్వచ్ఛంద సేవా సంస్థలకు రూ.25 వేల చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న వీసీ రాంజీ మాట్లాడుతూ ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్టార్, పవిత్ర కళాశాలలు, సన్ స్టార్ స్కూల్ విద్యార్థులు ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది కూడా హెచ్‌హెచ్‌ఓ ఫండ్‌ను సేకరిస్తూ సేవా సంస్థలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తుండడం అభినందనీయమన్నారు. వీరిని ఇతర విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో పీవీజే రామారావు, స్టార్ విద్యాసంస్థల ఫౌండర్, మెంటర్ శ్రీరామ్, డైరెక్టర్ బొమ్మిడి అయ్యప్ప స్వామి, మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జి కిషోర్ కుమార్, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



సత్కారం పొందిన ఉపాధ్యాయులతో వీసీ రాంజీ తదితరులు

కళాంజలి పాఠశాలలో హస్తకళల ప్రదర్శన

పెడన: పట్టణంలోని కళాంజలి హైస్కూలులో బుధవారం డెవలప్మెంట్ కమిషనర్ హ్యాండీక్రాఫ్ట్స్ (మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్) గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో హస్తకళల ప్రదర్శన, అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంఈవో-1 ఎస్.సలోమి, ఎంఈఓ- 2 హరినాథ్‌లు హాజర య్యారు. హ్యాండీక్రాఫ్ట్ ప్రమోటింగ్ ఆఫీసర్ హెచ్‌పీఓ రవీంద్ర గౌతమ్, సీఈవో టెక్స్‌వెన్‌యూ హ్యాండీక్రాఫ్ట్స్ పీవో లిమిటెడ్ జెడ్పీఎన్ శ్రీనివాసల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సలోమి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు హస్తకళలు నేర్చుకొని పర్యావరణానికి హాని కలగని ఎకో ఫ్రెండ్లీ వస్తువులు తయారు చేయాలన్నారు. ఇటువంటి వస్తువులు తయారు చేయడం ద్వారా సృజనాత్మకత పెరగడంతో పాటు పర్యావరణహితంగా ఉంటుందన్నారు. హ్యాండీక్రాఫ్ట్ ప్రమోటింగ్ ఆఫీసర్ రవీంద్ర గౌతం విద్యార్థులు హస్తకళలపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులను హస్తకళల వైపు ప్రోత్సహించడానికి డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు, ప్రోత్సాహక బహుమతులందిస్తామని తెలిపారు. హస్తకళల ద్వారా మన దేశ సంస్కృతి సంప్రదాయాలను అనుసరించటం, భవిష్యత్తు తరాల వారికి అందించటం మనకర్తవ్యమని ప్రిన్సిపల్ కె. దిలీప్‌కుమార్ అన్నారు. అనంతరం పాఠశాలలో హస్తకళలకు సంబంధించి కలంకారి అచ్చుల ద్వారా ముద్రణ వేయటం, గుర్రపు డెక్కతో తయారు చేసిన బుట్టలు, గోల్డ్ కవరింగ్ నగల తయారీ, లేసు అల్లికలు మొదలైన వస్తువులను ప్రదర్శించారు.



హస్తకళలను పరిశీలిస్తున్న ఎంఈవో-1, 2 సలోమీ, హరనాథ్ తదితరులు

ర్యాలీలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

పెడన సీఐ నాగేంద్రప్రసాద్

పెడన: మిలాదున్నబీ పండుగను పురస్కరించుకుని ముస్లింలు ఈ నెల 5వ తేదీన నిర్వహించతలపెట్టిన ర్యాలీలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన పెడన పోలీస్ స్టేషన్‌లో పట్టణానికి చెందిన ముస్లిం పెద్దలతో పాటు వివిధ మసీదు కమిటీల వారితో సమావేశం నిర్వహించారు. ర్యాలీలు నిర్వహించడానికి ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని, అలాగే ఎక్కడ నుంచి ఎక్కడి వరకు నిర్వహిస్తారు, సుమారు ఎంత మంది పాల్గొంటారనే వివరాలను ముందుగా తెలియజేయాల్సిందిగా ముస్లిం పెద్దలకు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ జి.సత్యనారాయణ, పెద్ద మసీదు కమిటీ అధ్యక్షుడు ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం పెద్దలు, మసీదు కమిటీలతో మాట్లాడుతున్న సీఐ నాగేంద్రప్రసాద్

మాదక ద్రవ్యాలు వాడితే భవిష్యత్తు నాశనం

చిలకలపూడి(మచిలీపట్నం): మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని శక్తి, ఈగల్ టీమ్ బృందం తెలిపారు. స్థానిక గ్రేస్ నర్సింగ్ కళాశాలలో 'డ్రగ్స్ వద్దు.. మన భవిష్యత్తు మన చేతుల్లోనే' అనే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీమ్ ఎస్సై మాణిక్యం మాట్లాడుతూ డ్రగ్స్, పొగాకు పదార్థాలు వాడటం వల్ల శారీరక, మానసిక, సామాజిక నష్టాలు, కుటుంబ సమస్యలు తలెత్తుతా యన్నారు. భవిష్యత్తు గురించి యువత ఆలోచించి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఏదైనా తెలిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1972కు సమాచారం అందివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బందరు తాలుకా ఎస్సై మల్లికాసులు, కాలేజీ కరస్పాండెంట్ సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శక్తి టీమ్ బృందం

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మచిలీపట్నం రాక

మచిలీపట్నంటౌన్: బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గురువారం మచిలీపట్నంలో పర్యటించనున్నారు. ఉదయం ఏడున్నర గంటల నుంచి ప్రధాన పార్కులో చాయ్ పే చర్చా కార్యక్రమం, చిలకలపూడి పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాల వేస్తారు. 10 గంటల నుంచి 11.30 గంటల వరకు నగరంలోని కోనేరు సెంటర్ నుంచి జిల్లా పరిషత్ వరకు శోభాయాత్రలో పాల్గొంటారు. జెడ్పీ హాల్లో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మీడియాతో చిట్ చాట్ చేస్తారు. సాయంత్రం నాలుగున్నర గంటలకు గోల్డ్ ఫ్రిన్స్ రోల్డ్ గోల్డ్ పరిశ్రమను సందర్శిస్తారు. అనంతరం రోల్డ్ గోల్డ్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం అవుతారు. ఆ తర్వాత స్థానిక బీజేపీ సీనియర్ నాయకుడు ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి గృహంలో ఆతిథ్యాన్ని స్వీకరిస్తారు.

క్లుప్తంగా

పౌష్టికాహారం తీసుకోవాలి



కృత్తివెన్ను: నాణ్యమైన పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా బాలింతలు, గర్భిణులు తీసుకోవాలని, అప్పుడే ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా నిలకడైన ఆరోగ్యాన్ని పొందగలమని ఐసీడీఎస్ అధికారులు అన్నారు. బుధవారం లక్ష్మీపురం పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలింతలకు, గర్భిణులకు నాణ్యమైన ఆహారం ఏవిధంగా లభ్యమవుతుంది, ఎలా తీసుకోవాలి అనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఝాన్సీ, ఏఎన్‌ఎం సునీత అంగన్‌వాడీ కార్యకర్తలు జోష్‌మేరి, వరలక్ష్మి, మణి, సూర్యకుమారి పాల్గొన్నారు.

వెండి నాగపడగ సమర్పించిన గుడివాడ వాసులు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో గుడివాడ వాస్తవ్యులు కె.ప్రవీణ్ భక్తిశ్రద్ధలతో స్వామివారికి సుమారు రూ.50 వేల విలువగల 380 గ్రాములతో తయారు చేయించిన వెండి నాగపడగ బుధవారం సమర్పించారు. దేవస్థానంలో నిర్వహించే నిత్యన్నదానానికి తెనాలి వాస్తవ్యులు పార్థసారధి, షణ్ముఖ ప్రియ దంపతులు భక్తిశ్రద్ధలతో రూ.50,001 విరాళంగా ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద రావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు తోట చెన్న కేశవ, బీవై కిషోర్, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సగం ధరకే ల్యాప్‌టాప్‌లు



చల్లపల్లి: శ్రీమంతురాజా యార్లగడ్డ శివరామప్రసాద్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి, ఎన్‌ఆర్‌ఐ మండవ శేషగిరిరావు సహకారంతో విద్యార్థులకు సగం ధరకే ల్యాప్‌టాప్‌లు అందిస్తున్నట్లు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ జి.వి.రామకృష్ణ తెలిపారు. బుధవారం ఎస్సార్‌వైఎస్పీలో 8, 9వ తరగతులు చదువుతున్న గంజాల అశ్విని, పోతార్లంక ధనుష్‌లకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ప్రస్తుతం ఇక్కడి మార్కెట్‌లో ఒక్కొక్క ల్యాప్‌టాప్ ధర రూ.50 వేల వరకు ఉందని, మండవ శేషగిరికి అమెరికాలో ఇదే ల్యాప్‌టాప్ రూ.23 వేలకు వస్తుందన్నారు. ఇందులో సగం రూ.11,500కే విద్యార్థులకు అందజేస్తున్నట్లు రామకృష్ణ తెలిపారు. చల్లపల్లి ఎస్సార్‌వైఎస్పీ స్కూల్‌తో పాటు మొవ్వ, మోపిదేవి, భట్లపెనుమర్రు, తాళ్ళపాలెం, తవిసిపూడి ప్రాంతాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్టెమ్ టెక్నాలజీ ఎడ్యుకేషన్‌కు ఎన్‌ఆర్‌ఐ శేషగిరిరావు సహకారం అందిస్తున్నారన్నారు. ఆయా పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా సగం రేటుకే ల్యాప్‌టాప్‌లు ఇస్తామని రామకృష్ణ చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాల పూజలు



మచిలీపట్నంటౌన్: స్థానిక రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసియున్న శ్రీ రంగనాయక స్వామి దేవస్థానంలో వార్షిక పవిత్రోత్సవాలలో భాగంగా రెండవ రోజైన బుధవారం అగ్ని మందనం అగ్ని ప్రణయానా, పవిత్ర శుద్ధి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన హోమాలు, పవిత్ర అదివాసులు కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వాహణాధికారి మాగపాటి సత్యప్రసాద్‌బాబు పర్యవేక్షించారు.

నిమజ్జన సమయంలో జాగ్రత్తలు పాటించాలి



పెడన: వినాయక చవితి సందర్భంగా గురువారం 9వ రోజు నిమజ్జనాలు అధికంగా ఉంటాయని, కమిటీలు పూర్తి బాధ్యత తీసుకుని నిబంధనలతో పాటు తగు జాగ్రత్తలు పాటించాలని పెడన ఎస్‌ఐ జి.సత్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారితో పాటు పట్టణంలోని వివిధ కూడళ్లలో వినాయక పందిళ్లను ఏర్పాటు చేసిన కమిటీ వారు 9వ రోజు నిమజ్జనం చేసేందుకు అనుమతుల కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎస్‌ఐను కలిశారు. ఈ సందర్భంగా కమిటీ వారికి ఎస్‌ఐ దిశానిర్దేశం చేశారు.

శ్రావ్యంగా సాగిన భగవద్గీత పారాయణం

నాగాయలంక: బహుళ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగాయలంక భగవద్గీత గ్రూపు ఆధ్వర్యంలో ప్రసన్నగణపతి దేవస్థానం 68వ వార్షిక వినాయక నవరాత్రి మహోత్సవాల పందిరిలో వంద మందికి పైగా మహిళలతో బుధవారం జరిగిన సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం శ్రావ్యంగా జరిగింది. గణపతి సచ్చిదానంద స్వామీజీ చేపట్టిన కోటి భగవద్గీత పారాయణ సంకల్పంలో భాగంగా మండల దత్త భక్త బృందం గ్రూపు నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిపినట్లు గోల్డ్ మెడల్ టీమ్ ప్రతినిధి చిట్టా వాణి ఈ సందర్భంగా వివరించారు. అవనిగడ్డ, బాపట్ల జిల్లా రేపల్లె, నాగాయలంక, పరిసర గ్రామాల నుంచి 100 మందికి పైగా మహిళలు గీత సంపూర్ణ పారాయణం చేశారు. తదుపరి పూజాధికములు జరిపి మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. కొల్లూరు అమృత, మాటూరి శైలజ, చిట్టా బేబి, వేమూరి పావని, అద్దేపల్లి శిరీష, నంబూరి సువర్ణలక్ష్మి, బొలిశెట్టి మంజుల, లక్ష్మీశిరీష తదితరులు పాల్గొన్నారు. నిత్య కార్యక్రమంలో భాగంగా ఉత్సవ వేదికపై ప్రసన్న గణపతి ఆలయంలో అంబా సాయికిరణ్‌శర్మ శ్రీలక్ష్మిగణపతి హోమం, పూజాధికములు నిర్వహించారు. ఉప్పల నాగేశ్వరరావు ఆర్థిక సౌజన్యంతో టి.సాయిరామ్ (కర్నూలు) భాగవతార్‌చే మధ్యాహ్నం హరికథా గానం జరిగింది.



గీతా పారాయణం చేస్తున్న మహిళలు

వెంకన్న చెంతకు కాలినడకన భక్తులు



గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రు భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు 60 కిలోమీటర్ల నుంచి 16మంది భక్తులు కాలినడకన వచ్చారు. రెండు రోజులుగా నడుస్తూ.. బుధవారానికి స్వామివారి చెంతకు చేరారు. భక్తుల తాకిడి అధికమవుతున్న ఈ ఆలయానికి బాపులపాడు మండలం అంపాపురం నుంచి ఈ భక్తులు నడుస్తూ వచ్చారు.

కోలాహలంగా వినాయక విగ్రహాల నిమజ్జనం



గూడూరులో ఊరేగింపుగా గణనాథుడు

గూడూరు: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని గూడూరు టెలిఫోన్ ఎక్స్ఛేంజి సెంటరులో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాన్ని బుధవారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. , డిజే వాయిద్యాల మధ్య ప్రత్యేకంగా రూపొందించిన వాహనంపై ఉదయం టెలిఫోన్ ఎక్స్ఛేంజి సెంటరు నుంచి బయలు దేరిన విఘ్నేశ్వరుడిని ఊరేగింపుగా పురవీధుల్లో తిప్పారు. రాత్రికి రామరాజుపాలెం కాల్వలో నిమజ్జనం చేశారు. యువత నృత్యాలు చేస్తూ బొజ్జ గణపయ్యను సాగనంపారు.



నిమజ్జనానికి బయలుదేరిన అసోసియేషన్ పందిరి గణపయ్య

బంటుమిల్లి: బంటుమిల్లితోపాటు పలు గ్రామాల్లో గత 8 రోజులుగా జరుగుతున్న గణపతి నవరాత్రుల సందర్భంగా పూజలు అందుకున్న గణనాథులు బుధవారం నిమజ్జనానికి బయలు దేరారు. విజయ గణపతి ఆలయం వద్ద మోటారు సైకిల్ వర్కర్ను అసోసియేషన్, కనకదుర్గనగర్‌లో నిలిపిన గణపయ్యలకు డీజే సౌండ్ పాటలు, యువకుల కేరింతలు, నృత్యాల మధ్య గ్రామోత్సవం నిర్వహించి బంటుమిల్లి ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు.

శతాధిక వృద్ధురాలు మృతి



గూడూరు: మండలంలోని మల్లవోలు శివారు ముదిరాజుపాలెంకు చెందిన శతాధిక వృద్ధురాలు పిట్టల భాగ్యం (108) బుధవారం మృతి చెందారు. ఆమెకు ఆరుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. కాగా వారికి మనవళ్లు, మనవరాళ్లు, మునిమనవలు మొత్తం సెంచరీ దాటిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. భాగ్యం మృతి చెందిన విషయాన్ని గ్రామంలో సర్వత్రా చర్చించుకోవడం విశేషం. మూడేళ్ల క్రితం 105 ఏళ్లు పూర్తి చేసుకోవడం పట్ల కుటుంబ సభ్యులు భాగ్యంను సత్కరించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

వెయ్యి మంది రైతులకు యూరియా పంపిణీ చేశాం

ఘంటసాల: మండలంలోని ఘంటసాల గ్రోమోర్‌కు, లంకపల్లి పీఏసీఎస్‌కు వచ్చిన యూరియాను వెయ్యికి మందికి పైగా రైతులకు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఘంటసాల గ్రోమోర్‌కు 555 బస్తాల యూరియా, లంకపల్లి పీఏసీఎస్‌కు 455 యూరియా బస్తాలు బుధవారం వచ్చాయన్నారు. దీంతో రైతులు పెద్ద ఎత్తున ఆయా గ్రామాల్లో చేరుకోవడంతో వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో రైతులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసి వెయ్యిమందికి పైగా రైతులకు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ చెప్పారు. రైతుల వేలిముద్రలు, ఓటీపీ ద్వారా యూరియా పంపిణీ చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో యూరియా పంపిణీని దగ్గర ఉండి సమీక్షించినట్లు చెప్పారు. త్వరలోనే మరోసారి యూరియా వస్తుందని రైతులు ఆందోళన చెందవద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ ఎస్.శ్యామల, ఎస్‌ఐ కె.ప్రతాప్ రెడ్డి, ఆర్‌ఐ కె.శ్రీనివాస్, రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



గ్రోమోర్ సిబ్బంది నుంచి వివరాలు తీసుకుంటున్న తహసీల్దార్ విజయ ప్రసాద్

రూ.1.32 లక్షలు పలికిన గణేష్ లడ్డూ



రూ.1.32 లక్షలకు దక్కించుకున్న లడ్డుతో వాణిశ్రీ, చంటి దంపతులు

మచిలీపట్నంటౌన్: గణపతి నవ రాత్రి మహోత్సవంలో భాగంగా నగరంలోని బ్రహ్మపురం శ్రీ సాయి గణేష్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహ పందిరి వద్ద లడ్డూ వేలం బుధవారం జరిగింది. ఈ వేలంలో గణనాథుని లడ్డూను 9వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ- జానకి రమణ (చంటి) దంపతులు రూ.1.32 లక్షలకు దక్కించుకున్నారు. గత 15 సంవత్సరాలుగా ఈ ఆలయం వద్ద గణేష్ లడ్డూను వాణిశ్రీ- చంటి దంపతులే దక్కించుకుంటూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా లడ్డూను దక్కించుకున్న వాణిశ్రీ దంపతులను భక్తులు అభినందించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ సిద్ధిబుద్ధి వినాయకుని పందిరి వద్ద లడ్డూ వేలం నిర్వహించారు. ఈ వేలంలో లడ్డూను మెప్మా విభాగంలో డీఈవోగా పని చేస్తున్న మోపిదేవి కిషోర్ రూ.8,300కు దక్కించుకున్నాడు. కిషోర్‌ను కార్యాలయ మేనేజర్ కె.ఎస్.ప్రసాద్, ఆర్.వో సమ్మెట వెంకటేష్, ఉత్సవ ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు కరపాటి శ్రీరామ్‌దుర్గాప్రసాద్, బండారు చక్రవర్తి అభినందించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com